వంతెనలు పూర్తయ్యేదెప్పుడు?



కొనసాగుతున్న గుండి వంతెన నిర్మాణ పనులు



వరద ఉధృతిలో గుండివాగు దాటుతున్న గ్రామస్థులు (ఫైల్)

- ముంచుకొస్తున్న వానాకాలం
- ఇంకా పూర్తి కాని ప్రధాన వంతెనలు
- దశాబ్దాలు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే
- ఈ ఏడాదీ తప్పని తిప్పలు

ఆసిఫాబాద్, మే 15: ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలకు ప్రత్యక్ష నరకమే. గూడేల నుంచి ప్రధానపట్టణాలకు రావాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. జిల్లాలోని 335పైగా ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యమే లేదంటే ఉన్న గ్రామాలకు వాగులు, వంకల రూపంలో వర్షాకాలమంతా అష్టదిగ్బంధనమే. ఇటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అయిదు ఏజెన్సీ మండలాలతో పాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, పెంచికలపేట, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల్లో ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్దవాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని వంకలపై నేటికీ వంతెనలు లేవు. దీంతో ప్రజానీకం బయట ప్రపంచానికి చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లాలో ఇలా చిన్నా చితక కల్వర్టు మొదలుకుని భారీ వంతెనల వరకు ఏవీ పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా ప్రజానీకం ఇక్కట్లు పడే పరిస్థితి నెలకొంది. పనులను వేగిరం చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రతీ వర్షాకాలంలో ఈ సమస్యలు తప్పడం లేదని వివిధ మండలాలకు చెందిన ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ప్రధాన వంతెనల నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల ప్రజలు తిప్పలు పడాల్సిందే.

ఏళ్లుగా సా..గుతున్న వంతెనల నిర్మాణాలు..

గ్రామాలకు రవాణా కష్టం తీర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పూర్తిస్థాయిలో చేరడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలు ఇప్పటికీ కష్టాలు పడుతున్నారు. కాలంతో కుస్తీ పడుతూ సమస్యల సుడిగుండంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండి వంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నరగా కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుండి గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కెరమెరి మండలంలోని ఉమ్రివంతెన అసంపూర్తిగా ఉండడం వల్ల మహారాష్ట్రలోని 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు వర్షాకాలంలో నిలిచి పోతాయి. అదేవిధంగా మండలంలోని అనార్‌పల్లి- కరంజివాడ, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాగజ్ నగర్-వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు 15 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అ సంపూర్తిగానే ఉంది. దీంతో ఆయాగ్రామాల ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

అకాల వర్షానికి కొట్టుకుపోయిన గుండివాగు తాత్కలిక వంతెన..

ఇటీవల కురిసిన అకాలవర్షానికి గుండివాగుపై నిర్మించిన తాత్కలికవంతెన కొట్టుకుపోయింది. దీంతో గుండి ,కన్నర్‌గాం, నందూప, చోర్‌పల్లి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుండి వంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నర కాలం పాటు కొనసాగుతుండటంతో ప్రతియేటా వర్షకాలంలో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి వర్షం కురుసిన తాత్కలికవంతెన కొట్టుకుపోతుడటంతో వాగు దాటుకుంటూ పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు, పిల్లలు, ద్విచక్రవాహన దారులు, చంటిపిల్లల తల్లులు ప్రమాదకరంగా నీటిలోనుంచి వాగును దాటుతున్నారు. వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన గుండివాగు తాత్కాలిక వంతెన

వంతెన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి..: నానాజీ : గుండి



గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు 15ఏళ్లుగా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రతిఏటా వర్షాకాలంలో గుండి ఆయాగ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో జిల్లాకేంద్రానికి రావాలంటే వాంకిడి మండ లం ఖమాన మీదుగా రావాల్సిన పరిస్థితి నెలకొంది.

యేటా ఇవే ఇబ్బందులు..: మునీశ్వర్: గుండి



వర్షాకాలం వచ్చిందటే చాలు యేటా ఇవే ఇబ్బందులు. వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అకాల వర్షాలకు తాత్కలిక వంతెన సైతం కొట్టుకుపోయింది. దీంతో వాగు దాటి గ్రామానికి చేరుకోవాల్సి వస్తోంది. అధికారులు దృష్టిసారించి వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి.



గుండివాగు దాటుతున్న గ్రామస్థులు

విజయవంతంగా ఎన్నికల నిర్వహణ: ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మే 15: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వ హించడంలో జిల్లా పోలీసు యంత్రాంగం నిర్విరామ కృషిచేసినట్లు ఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌టీంలు, స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు, కండక్ట్ కోడ్ టీంలు, చెక్ పోస్టు ఏర్పాటు చేసి అక్కడ సివిల్‌పోలీసు, స్టాటికల్ సర్వేలెన్స్ సిబ్బంది, కేంద్రసీఆర్‌పీఎఫ్ బలగాలు 24గంటలపాటు వాహనాల తనిఖీ నిర్వహించాయన్నారు. అలాగేజిల్లాలో ఉన్న అధికారులు, సిబ్బంది, మహిళాసిబ్బంది, హోంగార్డులు, ట్రైనింగ్ కానిస్టేబుల్, ట్రైనింగ్ సిబ్బంది, కేంద్ర సీఆర్‌పీఎఫ్ బలగాలు మొత్తం 2000మంది అధికారులు, సిబ్బందితో లోక్‌సభ ఎన్నికలకు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రూ.2,04,72,950 నగదు స్వాధీనపర్చుకుని 182కేసులు నమోదు చేశామన్నారు. అలాగే 9,588 కిలోల గంజాయితోపాటు 14మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 1315లీటర్లమద్యం స్వాధీనపర్చుకున్నామన్నారు. 31కేసుల్లో717 మందిని 107,110,151సీఆర్‌పీసీసెక్షన్ల కింద బైండోవర్ చేశామన్నారు. 10 ఎన్‌బీడబ్ల్యూ అమలు, ఇంటర్‌స్టేట్ 4చెక్‌పోస్టులు, ఇంటర్‌డిస్ట్రిక్ 2చెక్ పోస్టులు, ఎస్ఎస్‌టీ టీంలు 9, ఎఫ్ఎస్‌టీ టీంలు 9ఏర్పాటు చేశామన్నారు. 23గ్రామాలు, పట్టణాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, గ్రామాల్లో ఎన్నికలపై ప్రజలకు పోలీసుకళాబృందాల ద్వారా జానపద కథలు, నాటకాలు, పాటలద్వారా ఓటుహక్కుపై శాంతియుత వాతావరణం కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు వివరించినట్లు తెలిపారు.

20 మందిపై కేసులు నమోదు

జైనూర్, మే 15: మండలకేంద్రంలో ఇటీవల జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఇప్పటివరకు 20మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని జైనూర్ ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఘర్షణ సంఘటనలో ఇంక ఎంతమంది ఉన్నారో వారిపై సమగ్రవిచారణ జరుపుతున్నామని అన్నారు. దోషులు ఎంతటి వారైన గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఇరువర్గాల ఘర్షణ కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు బలగాలను మొహరించామని అన్నారు. అన్నివర్గాలప్రజలు రాజకీయనాయకులు, మతపెద్దలు సహకరించాలని, సంయమనం పాటించాలని పేర్కొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, మే 15: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 31వరకు జిల్లాకేంద్రంలోని గిరిజన క్రీడాపాఠశాలలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంప్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా, గిరిజన సంక్షేమశాఖ డీడీ రమాదేవి, గిరిజన క్రీడాధికారి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24సంవత్సరంలో కుమరంభీం, మంచిర్యాలలో జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 60మంది బాలురు, 60మంది బాలికలను ఇప్పటికే ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని క్రీడాకారులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, 6అంశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

20న ఆలయ భూముల కౌలు వేలం

ఆసిఫాబాద్ రూరల్, మే 15: జిల్లాకేంద్రంలోని కేశవ ఆలయం ఆధీనంలో ఉన్నభూములు ఒకసంవత్సరం కౌలుఇవ్వడానికి ఈనెల20న బ్రాహ్మణవాడలోని మినీఫంక్షన్‌హాల్‌లో వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తాఒకప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదల్చిన వారు ముందుగా రూ.50వేల ధరావత్తు సొమ్ముగా చెల్లించాలని పేర్కొన్నారు. వేలంపాట పూర్తైన తరువాత పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్ కుమార్

కాగజ్‌నగర్, మే 15: విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని డీఈవో అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం డీఆర్సీ భవనంలో పాలిటెక్నిక్, ఇతర పోటీ పరీక్షల కోసం ఇస్తున్న ఉచితశిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రతివిద్యార్థి జీవితం పదవతరగతి కీలక మలుపు తిరుగుతుందన్నారు. చక్కటి లక్ష్యంతో చదవాలన్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే అన్ని అంశాలపై చక్కటి పట్టు పెంచుకోవాలన్నారు. అలాగే సమయాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా ప్రిపేర్‌కావాలన్నారు. ఈసందర్భంగా డీఈవో విద్యార్థులకు రసాయనశాస్త్రంలో పాఠాలను బోధించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మూడో రోజు బంద్ ప్రశాంతం

జైనూర్, మే 15: జైనూరులో ఇటీవల జరిగిన ఘర్షణ కారణంగా మూడోరోజు బుధవారం బంద్ ప్రశాంతంగా సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో, అదేవిధంగా సంజీవ్‌నగర్ కాలనీలో ప్రజల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తులో ఉన్నారు. దీంతోపాటు 144సెక్షన్ కారణంగా ప్రజలు బయటికి రావడాని ఆసక్తికనబర్చలేదు. వాహనాలను క్షుణంగాతనిఖీలు చేస్తున్నారు. అందరుశాంతియుతంగా కలిసి ఉండేలాశాంతి వాతావరణం నెలకొల్పేందుకు మండలవాసులు సహకరించాలని పోలీసులు కోరారు.



జైనూర్‌లో మూసి ఉన్న దుకాణాలు

భారీ బందోబస్తు మధ్య గోదాంకు ఈవీఎంలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 15: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన రిజర్వు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భారీబందోబస్తు మధ్య జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో గల ఈవీఎం గోదాంలో భద్రపరుస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ తోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో గల ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో లోక్‌సభ ఎన్నికల కోసం రిజర్వులో ఉంచిన ఎలక్ట్రానిక్ ఓటంగ్‌యంత్రాలను ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి పీటీజీ బాలుర పాఠశాలలో, సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించిన కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి వాటిని భారీ బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఈవీఎం గోదాంలో భద్రపరుస్తామని తెలిపారు. ఈ గోదాం వద్ద పటిష్ఠ భద్రత కల్పిస్తామని అన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, నాయబ్ తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



భూసార పరీక్షల పత్రాలను అందజేస్తున్న ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆఫీసర్

చింతలమానేపల్లి, మే 15: ప్రతీరైతు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆఫీసర్ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్జవెల్లి గ్రామంలో భూసార పరీక్షల్లో భాగంగా మట్టినమునాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు తమ నేల భూసారాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. తద్వారా ఎరువుల వాడకం అనవసరఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందవచ్చన్నారు. భూసారపరీక్షలు చేయడంలో పోషకాల పరిమాణంకాకుండా భూమిలోని చౌడు,సున్నంశాతాన్ని గుర్తించవచ్చన్నారు. అనంతరం రైతులకు భూసారపరీక్షల పత్రాలు(భూఆరోగ్యపత్రాలు)పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరిస్ ఆగ్రోలిమిటెడ్ సిబ్బంది నితేశ్వర్, కాళిదాస్, సాయికుమార్, నారాయణ, చంద్రశేఖర్, రామకృష్ణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, సిర్పూర్(యు)లో కురిసిన వర్షం



సిర్పూర్(యు)లో కురుస్తున్న వర్షం

కాగజ్‌నగర్, మే 15: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం అకాలవర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతవరణం చల్లబడింది. లోతట్టుప్రాంతాల్లోకి వర్షంనీరు చేరింది. చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అలాగే మండలంలో కూడా పలుచోట్ల వర్షం కురిసింది. పలువార్డుల్లో బురదతో పట్టణవాసులు ఇబ్బందులు పడ్డారు.

సిర్పూర్(యు): మండలంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఉరుములు మెరుపులతో దాదాపు గంటపాటు వర్షం పడింది.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఆసిఫాబాద్ రూరల్, మే 15: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షరాసే విద్యార్థులకు రూ.1000అపరాధ రుసుంతో ఈనెల 16వతేదీవరకు ఫీజు చెల్లించేందుకు గడువుపెంచినట్లు జిల్లాఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్‌బీఐఈ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజుచెల్లించే అవకాశం ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

- తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు



ఇంటివద్ద లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న పుర్క బాపురావు



ఆస్పత్రిలో లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న కోట్నాక విజయ్‌కుమార్

సిర్పూర్(యు), మే 15: జైనూర్ మండల కేంద్రంలో ఈనెల13న ఆదివాసీయువకుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడిచేసిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మర్సుకోల లక్ష్మణ్ ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించారు. ఘటన జరిగిన తీరును బాధితుడిని డిగి తెలుసుకున్నారు. ఆదివాసీ యువకుడిపై హత్యాయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వలస వాదులు అక్రమంగా ఏజెన్సీ ప్రాంతంలో చొరబడి ఆదివాసీలపైనే దాడులకు పాల్ప డడం హేయమైన చర్య అన్నారు. ఏజెన్సీలో ఇలాంటి అల జడికి కారకులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. జైనూర్ ఘటనలో గాయపడిన మర్సుకోల లక్ష్మణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి అట్రాసిటీ కేసు నమోదు చేయలన్నారు. లేనిపక్షంలో ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జై ఆదివాసీ యువ శక్తి జిల్లా ప్రధానకార్యదర్శి ఆడ హన్మంత్‌రావు, తుడుం దెబ్బ నాయకులు కుంరం కోటేశ్వరరావు, పెందుర్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

జైనూర్: మరుస్కోల లక్ష్మణ్‌ను బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కుమార్ బుధవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని బీజేపీ ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్ రూరల్: జైనూరు మండల కేంద్రంలో చిన్నచిన్న కారణాలతో హిందువులపై మూకుమ్మడిగా దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో దాదాపుగా 500 మందితో ఒడ్డెరగూడలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు దుండగులను కఠినంగా శిక్షించాలని అన్నారు. గొడవలకు కారణాలపై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచా రణ జరపాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో హిందువాహిని సభ్యులు జి ప్రణయ్, ఎ ప్రణయ్ తదితరులు ఉన్నారు.

చెస్ ఉచితశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, మే 15: చెస్ ఉచితశిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని జడ్పీటీసీ వేమురి సంతోష్ తెలిపారు. బుధ వారం టీబీజీకెస్ కార్యాలయంలో ఉచిత చెస్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెస్ ఆడటంవల్ల మేథో శక్తి పెరుగుతుందన్నారు. చెస్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. చెస్‌పోటీల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని కోరారు. జిల్లా చెస్‌అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యా ర్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధానకార్యదర్శి కల్పన, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆటను పరిశీలిస్తున్న జడ్పీటీసీ వేమురి సంతోష్

పార్కింగ్‌గా మారిన అండర్ బ్రిడ్జి

తాండూర్, మే 15: తాండూర్‌లో ఇటీవల జాతీయ రహదారి విస్త రణ అనంతరం యూనియన్ బ్యాంకు ఎదుట వాహనాల రాకపోకల కోసం అండర్ పాస్ బ్రిడ్జిని నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకల కోసం కాకుండా ప్రజలు పార్కింగ్ కోసం వినియో గిస్తున్నారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతోపాటు పరిసర ప్రాంతాల వాహనదారులు అండర్ పాస్ బ్రిడ్జి కింద వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల 108 వాహనానికి సైతం అండర్ పాస్ బ్రిడ్జి కింద నుంచి వెళ్లేందుకు వీలు లేకుండా వాహ నాలు నిలిపి ఉన్నాయి. అత్యవసర సమయంలో సమయం వృథా కావాల్సి వచ్చింది. సంబంధిత నేషనల్ హైవే అధికారులతోపాటు పోలీసులు సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.


అండర్ పాస్ బ్రిడ్జి వద్ద నిలిపి ఉన్న వాహనాలు

రోడ్డు పక్కన ముళ్ల పొదలు

- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు


రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

బెల్లంపల్లి, మే 15: మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు, ఇతర చెట్లు ఏపుగా పెరగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి నుంచి తాళ్లగురిజాల, మాల గురిజాలతో పాటు నెన్నెల మండలం వైపు, అదే విధంగా జన్కాపూర్ గ్రామం వైపు వెళ్లే రోడ్లకు ఇరువైపు లా ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వస్తుండడంతో ద్విచక్రవాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనబడడం లేదు. ఒక్కో ప్రాంతంలో మూల మలుపుల వద్ద చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం బెల్లంపల్లికి వస్తుంటారు. తరుచూ ప్రమాదా లతో పాటు ఇబ్బందులు పడుతుండడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపైకి వస్తున్న చెట్లను, ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సప్ గ్రూపుల్లో సైలెన్స్ పోస్టులు

బెల్లంపల్లి, మే 15: లోక్‌సభ ఎన్నికలు పూర్తివడంతో వా ట్సప్ గ్రూపుల్లో సైలెన్స్ పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఓటర్లను ఓటు వేయాలని ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు సైతం వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో ప్రచారం చేశా రు. బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారాలను, ఓటు కోసం అభ్యర్థనలను నాయకులు, కార్యర్తలు ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో, ఫేస్‌బుక్‌లో పోస్టులు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అంతేకాకుండా అభ్యర్థుల ప్రచారాలను సినిమా పాటలతో సెట్ చేసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దాదాపు నెల రోజులకు పైగా ఏ వాట్సాప్ గ్రూపు ఓపెన్ చేసినా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు కనిపించేవి. సోమవారం ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, సోషల్ మీడియా మూగబోయింది. ఈ సారి అసెంబ్లీ , లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోసల్ మీడియాను బరిలో ఉన్న అభ్యర్థులు ప్రధానాస్త్రంగా భావించి పోటా పోటీగా ప్రచారం చేసుకున్న విషయం తెలిసిందే. ఏకంగా మరికొందరు అభ్యర్థులైతే స్వతహాగా ప్రైవేటు ఆల్బమ్ పా టలను రూపొందించి కింది స్థాయి నాయకులు, కార్యక ర్తలతో ప్రచారాస్త్రాలుగా మార్చుకున్నారు. అంతేకాకుండా ప్రచారంలో సైతం లైవ్‌గా ప్రచారం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. ఓటర్లను ఆకర్షించే విధంగా సోషల్ మీడియాలో టెక్నాలజీని ఉపయోగించారు. బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచార సమయంలో తమ నాయకున్ని ఇతర పార్టీల నాయకులు అసత్యపు ప్రచారాలు చేసినా అందుకు భిన్నంగా కౌంటర్‌లు ఇస్తూ ముందుకు సాగారు. ఇలా నెల రోజులకు పైగా ప్రచారాస్త్రంగా సోసల్ మీడియాను వాడుకున్న అభ్యర్థులు ఎన్నికలు ముగిసిపోవడంతో వాట్సప్ గ్రూపులు సైలెంట్‌గా మారాయి.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నెన్నెల, మే 15: జెండావెంకటాపూర్ గ్రామంలోని యేస్కూరి కృష్ణవేణికి చెందిన కిరాణం షాపులో దొంగతనానికి పాల్పడిన అదే గ్రామాకి చెందిన దూట శశికాంత్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన రాత్రి దుకాణం తలుపులు గడ్డపారతో పగులగొట్టి బీరువాలోని 5 తులాల బంగారు అభరణాలు, రూ. 20 వేల నగదు దొంగిలించాడని చెప్పారు. బాదితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆధారలు సేకరించామన్నారు. వేలి ముద్రల ఆధారంగా శశికాంత్‌ను పట్టుకున్నామన్నారు. నిందితుడు తాను నేరం చేసినట్టు ఒప్పుకున్నాడని అతడి వద్ద నుంచి బంగారం స్వాదీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచామని ఎస్సై వివరించారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● ఉమ్రిలో గౌతమబుద్దుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ● పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఉట్నూర్, మే 15: డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాం గాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు.ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో జరిగిన గౌతమబుద్దుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.ముందుగా బుద్దుడు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దళితులు, ఆదివాసీ గిరిజనుల, సంస్కృతీ సంప్రదాయాలను దెబ్బతీసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలంతా కలిసి కట్టుగా ఉండి ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాం గం ప్రమాదంలో ఉందని, ఆ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతై నా ఉందన్నారు. అంబేద్కర్ దయవల్లే తాను ఎమ్మెల్యే అయ్యానని పేర్కొన్నారు. యువత బుద్దుడు, అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కుడిమేత వికాస్, దళిత సంఘాల నాయకులు భారత్ వాఘ్మారే తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్, బుద్దుడు చిత్రపటాలకు నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

● కష్టపడ్డ వారికి గుర్తింపు

ఉట్నూర్: పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్క కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడి ఆరు గ్యారంటీ లతో పాటు ఐదు న్యాయాలను గడపగడపకూ వెళ్లి ప్రచారం చేసిన ప్రతీఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాయే ఎగర బోతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇంద్రవెల్లిలో ఈదురుగాలుల వర్షం

● పలుచోట్ల ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు, రేకులు ● బోథ్‌లో గంటపాటు జోరు వాన

ఇంద్రవెల్లి, మే 15: మండలంలోని మారుమూల గ్రామాలైన డొంగర్ గమ్, భీంజితండా, హరాపూర్, మారుతిగూడ, పడగామ్, పాటగూడ, అండ్‌గూడ, పాకిడిగూడ, మోడిగూడ, పొల్లుగూడ, వాల్గొండ, తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని భీంజితాండ గ్రామానికి చెందిన పలువురి ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరపోయాయి. రేకులు ఉడిపోవడం తో వర్షపు నీటితో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసిపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంంగా ఇంటి పైకప్పులు ఊడిపోయిన ఇళ్లను పరిశీలించి పరిహారం అందించాలని ఆయా గ్రామాల్లోని బాధితులు కోరారు.


బోథ్‌లో జొన్నలపై పారిని కప్పుతున్న రైతులు

● బోథ్‌లో గంట పాటు భారీ వర్షం

బోథ్: మండలంలో బుధవారం సాయంత్రం పూట కురిసిన భారీ వర్షంతో జొన్న పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులు అతలా కూతలమయ్యారు. ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవడంతో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన జొన్నలపైన కప్పిన పారిలు లేచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. మరో వైపు రైతులు మార్కెట్ షెడ్‌లో వేసవి జొన్న పంటపై పారీలు కప్పి వాటిపైన గాలికి లేవకుండా కూర్చున్నారు. ఆకస్మికంగా కురిసిన వర్షంతో చేతికి వచ్చిన జొన్న పంట నష్టపోయే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి

- బీఆర్ఎస్ విజయం ఖాయం
- మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మే 15: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి పార్టీ శ్రేణులంతా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారని, నిద్రాహారాలు మాని గెలుపు కోసం కష్టపడ్డ వారందరికి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాల పై ప్రజలు తీవ్ర అసంతృప్తితోఉన్నారని అన్నారు. తమ ప్రభుత్వ హాయంలో పది లక్షలకు పైగా మంది లబ్దిదారులు వివిధ పథకాల ఫలాలు పొందారని తెలిపారు. వారిలో ఎక్కువ శాతం మంది కారు గుర్తుకే ఓటు వేశారని, సైలెంట్ వోటింగ్ పెద్ద ఎత్తున జరగడంతో బీఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు డబ్బులు ఆశచూపిన ప్రజలు తమవైపే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైనందున ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, పెన్షన్ల పంపిణీ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీతోను ఆదిలాబాద్ ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్, బీజేపీల పై ఉన్న వ్యతిరేకత తమకు సానుకూలంగా మారిందని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేష్, సాజిదొద్దిన్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, కుమ్రరాజు, భూమన్న, పర్వీన్‌ఫెరోజ్, జోహార్‌బాయ్, నవాతే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సమాన విద్య అందాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

ఏసీసీ, మే 15: దేశ ప్రజలందరికి సమాన విద్య అందాలని డెమోక్రటిక్ టీచర్స్‌ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లింగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓప్రైవేటు హాలులో బుధవారం మంచిర్యాలజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రాష్ట్ర అకాడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా విధానం 2020 అశాస్త్రీయంగా ఉందన్నారు. మతాన్ని ప్రోత్సహిస్తూ పేద వారికి ఒక రకమైన విద్య, డబ్బున్న వారికి మరో విద్యను అందించేందుకు దోహదం చేస్తున్నాయని చెప్పారు. విద్య వ్యాపారంలోకి ప్రైవేటు కార్పొరేట్ శక్తులను అనుమతిస్తూ దీన్ని రూపొందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీలో 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు వీలైనంత త్వరగా చేపట్టాలని చెప్పారు.. పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి పాటు పడే సంఘం డీటీఎఫ్ మాత్రమేనని తెలిపారు. విద్యార్థులందరికి కామన్ స్కూల్ విధానం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, నాయకులు కుమార్, ప్రకాష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్‌కుమార్

హాజీపూర్, మే 15: హాజీపూర్ గ్రామానికి చెందిన నరేష్‌ను హత్య చేసిన నిందితుడు చైతన్యను బుధవారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను సీఐ వెల్లడించారు. హాజీపూర్ గ్రామానికి చెందిన మల్యాల నరేష్(32)అనే యువకుడు మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. నరేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం ఆమె సోదరుడికి తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నరేష్ యువతి ఇంటి వద్ద కనిపించాడు. కోపోద్రిక్తుడైన ఆమె సోదరుడు నరేష్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో నరేష్‌ను నెట్టివేయడంతో కింద పడ్డాడు. అనంతరం బండరాయితో నరేష్‌పై తలపై కొట్టాడు. తీవ్ర గాయాలతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నరేష్ తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలించగా హాజీపూర్‌లో తన ఇంటి నుంచి పారి పోవడానికి యత్నిస్తున్నాడే సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు

ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

పట్టించుకోని అధికారులు


పాలచెట్టు ఏరియాలో వృథాగా పోతున్న నీరు

మందమర్రిటౌన్, మే 15: పట్టణంలో పలు కాలనీల్లో తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల దాహార్తి తీర్చేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ సురక్షిత తాగునీరు పట్టణంలో వృథాగా పోతుంది. దాదాపు రూ. 40 కోట్లతో చేపట్టిన ఈ పథకం మందమర్రిలో పూర్తయిన ఇంత వరకు తాగునీరుకు ప్రజలు నోచుకోలేదు. పట్టణంలో 24 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డులకు మిషన్ భగీరథ పైపులైన్‌లు వేశారు. వాటికి ఇంటింటా నల్లా కనెక్షన్‌ల పేరిట తాగునీటి పైపులు అమర్చారు. కానీ గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వ లేదు. దీంతో మిషన్ భగీరథ నీటిని విడుదల చేసినప్పుడల్లా నీరు వృథాగా పోతుంది. గత పది రోజులుగా 1, 2వ జోన్‌లు, పాల చెట్టు ఏరియాలో 2 గంటలకు పైగా నీరు వృథాగా వరదలా పారుతుంది. కొన్ని గృహాల్లో ఈ పైపులైన్‌కు సంబంధించి వాల్వులు అమర్చగా అవి లీకై నివాసాల్లో కూడా నీరు చేరింది. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని ఇంటి యాజమానులు వాపోతున్నారు. కోట్ల రూపా యల నిధులు వెచ్చించి


రెండో జోన్‌లో వృథాగా పోతున్న నీరు

వార్డుల్లో భగీరథ పైపులైన్‌లు వేసి వాటికి నల్లాల కనెక్షన్‌ల పేరిట పైపులు బిగించి గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వకుండా రోడ్డుపైనే వదిలి వేయడం ఏంటని ప్రజలు మండి పడుతున్నారు. మార్కెట్ సెంటర్‌లో భగీరథ పైపులైన్ వేసినా నల్లా కనెక్షన్‌లు ఇవ్వక ఏడాది గడిచి పోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

మందమర్రిటౌన్, మే 15 : ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు పనిచేస్తున్నారని ఇష్టం వచ్చిన విధంగా రోగులకు సొంత వైద్యం చేయడం లేదని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మందమర్రి పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, సంయుక్త కార్యదర్శి రవీందర్ తెలిపారు. బుధవారం పట్టణంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము అధికారుల సూచనల మేరకు రోగులకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. తమ సమస్యలపై త్వరలోనే సీఎంను కలిసి వివరిస్తామని తెలిపారు. సమావేశంలో శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, తిరుమల్‌రెడ్డి, రవికుమార్, వెంకటేశం, మతీన్‌ఖాన్, సత్యం, రవి, పోశం, సత్యనారాయణ, దామోదర్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఏసీసీ, మే 15: పట్టణంలోని గోపాల్‌వాడకు చెందిన గడిగొప్పుల సదానందం (46) అనే ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం మృతి చెందగా బుధవారం ఆయన కళ్లను కుటుంబీకులు దానం చేశారు. ఇంటి పెద్ద దిక్కుకో ల్పోయిన దుఃఖంలో కూడా సమాజహితం కోసం నేత్రదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆలోచనను పలువురు అభినందించారు. అమెరికాలో ఉంటున్న సదానందం కూతురు , అల్లుడు మధుప్రియ ముకేష్ రావడానికి ఆలస్యం అవుతుండడంతో మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో భద్రపరిచారు. కుటుంబీకులు కళ్లను దానం చేయాలని తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధి కృష్ణరెడ్డి సహకారంతో సదానందం నేత్రాలను బుధవారం సేకరించి సకాలంలో హైదరాబాద్‌కు తరలించారు. నేత్రాలను దానం చేయడానికి అంగీకరించిన భార్య సంధ్య, చిన్న కుమార్తె బిందు, సోదరుడు చందులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణరెడ్డిలు అభినందించారు.

వేసవి సెలవులు.. నైపుణ్యతకు నెలవులు..





దండేపల్లి,మే 15: వేసవి సెలవులంటేనే పిల్లలకు ఆటవిడుపు. అమ్మమ్మ, నానమ్మ, ఇళ్లకు వెళ్లి ఆటలుఆడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఇక వేసవిసెలవులో వారికి నచ్చిన ఆటలాడుతూ ఆనందంగా గడుపుతారు. మరికొందరు పిల్లలు స్విమ్మింగ్‌పూల్, శాస్త్రీయ నృత్యం, కంప్యూటర్ విద్యలో శిక్షణ తీసుకుంటారు. ఉదయం, సాయంత్రం వేళలో పలు వీధుల్లో యువత విద్యార్థులు, పిల్లల సందడితో కనిపిస్తున్నాయి. పదో తరగతి ఇంటర్, విద్యార్థులకు సెలవులలో సిలబస్‌పై పట్టుసాధించి పదిలో ఫలితాల సాధనకు అవకాశం. ఏప్రిల్, మే నెలలు విద్యార్థుల ప్రతిభకు, పోటీ పరీక్షలకు సృజనాత్మకతకు, ఇష్టమైన వాటిలో నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు నెలవుగా మారాయి.

- ఖోఖోతో శరీరం అంతా కదలటంతో పాటు పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. మిత్రులతో కలివిడితనం పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఈక్రీడ ఎంతో దోహదపడుతుంది.
- గ్రామీణ ఆటల్లో కబడ్డీ ఒకటి. ఆటతో శరీర ధృఢత్వం పెరగడంతో పాటు వేగంగా ఆడే ఆట కావడంతో రక్తప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడుతాయి.
- సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థులో మానసిక ఉల్లాసంతో పాటు, చురుకుదనం పెరుగుతుంది.
- చిన్నారులు ఇంటి దగ్గరే నేర్చుకొనేందుకు వీలున్న టెన్నికాయిట్
- వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట వాలీబాల్ అందరికి మంచి వ్యాయమం అవుతుంది.
- వేగంగా ఆడే ఆటలో పుట్‌బాల్ ఒకటి. దీనివల్ల శరీరంలో అన్ని అవయవాలు చురుకుగా పనిచేస్తాయి.
- ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఎలా గురి పెట్టాలో నేర్పేదే క్యారమ్స్. విద్యార్థులు వేసవిలో ఇంటి దగ్గర నేర్చుకోవచ్చు.దీనితో చదువులో ఏకాగ్రత పరుగుతుంది.
- విద్యార్థులో మేధస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైంది. ఆటతో విద్యార్థికి సమయ స్ఫూర్తి,ఆలోచనాశక్తి. సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది.
- నృత్యంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు డాన్స్ నేర్చుకునేందుకు వేసవి సెలవులు ఎంతో ఉపయోగపడుతాయి. కూచిపూడి, భరతనాత్యం లాంటి డ్యాన్స్‌లు నేర్చుకోవటం ద్వారా వ్యక్తి అభిరుచి పెరగటంతో పాటు. పది మందిలో గుర్తింపు వస్తుంది.
- కరాటేలో శిక్షణ తీసుకొవడం ద్వారా చిన్నారుల ఆత్మరక్షణకు దోహద పడుతుంది. కరాటేలో శిక్షణ తీసుకోవటంతో విద్యార్థులకు శారీరక మానసిక ప్రశాంతత ఉంటుంది.
- ఈత నేర్చుకోవడానికి వేసవి సెలవులను సదవకాశంగా చెప్పవచ్చు. అత్యవసర సమయాల్లో తమను తాము రక్షించుకోవటానికి ఇది ఉపయోగ పడుతుంది. గ్రామీణ క్రీడలతో శారీర ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని వ్యాయమ ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

వ్యక్తి మృతికి కారకులైన ఇద్దరికి జైలు శిక్ష

కన్నెపల్లి, మే 15: మండలంలోని లింగాల గ్రామపంచాయతీకి చెందిన చౌదరి వెంకన్న మృతికి కారణమైన ఇద్దరికి బుధవారం మంచిర్యాల జిల్లా కోర్టు జడ్జి జైలు శిక్ష విధించినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. చౌదరి వెంకన్న భార్య దన్నూరి రాజు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగించింది. ప్రశ్నించిన వెంకన్నను వారు ఇద్దరు మనస్తాపానికి గురి చేసి పురగులు మందు తాగి ఆత్మహత్యచేసుకునే విధంగా ప్రేరేపించారు. దీంతో 2019లో వెంకన్న పురుగుల మందు తాగాడు. బంధువులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న అన్న చౌదరి మధుకర్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం నిందితులను కోర్టులో హాజరు పరుచగా నేరం రుజువు కావడంతో నిందితులు చౌదరి లక్ష్మికి ఐదేళ్లు, దన్నూరి రాజుకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రామకృష్ణాపూర్, మే 15: రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కలవేన సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం బాధిత కుటుంబానికి రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ సంపత్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారికి చదువు నిమిత్తం దాతలు సాయం అందించాలని కోరారు.

ఉర్సుకు వేళాయె..

- మతసామరస్యానికి ప్రతీక సయ్యద్ తాలీబ్‌అలీషా బాబా దర్గా
- రేపటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు
- కవ్వాలీ సహ సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు

సిర్పూర్(టి), మే 15: మండల కేంద్రంలోని డొనల్ ఏరియాలో ఉన్న సయ్యద్ తాలీబ్ అలీషాబాబా దర్గా ఉర్సుఉత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 17, 18, 19తేదీల్లో జరిగే వేడుకలకు మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, చెన్నూరు ఆదిలాబాద్, కౌటాల, ఉట్నూరు నుంచే కాక మహారాష్ట్రలోని అహిరి, చంద్రాపూర్, బల్లార్షా, తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాను న్నారు. దర్గాను దర్శించుకొని ప్రత్యేకపూజలు చేస్తారు. తొలిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, రెండో రోజు రాత్రి కవ్వాలి నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలి పారు. ఈ ఉత్సవాల కోసం ఆసిఫాబాద్, మంచిర్యాల ఆర్టీసీ డిపోలనుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



సిర్పూర్(టి)లోని సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా

దర్గా చరిత్ర..

పూర్వీకుల కథనం ప్రకారం.. ఢిల్లీ నిజామొద్దీన్ వంశానికి చెందిన హజరత్ సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం చిన్న వయస్సులో పెన్‌గంగా, ప్రాణహిత నదులను దాటి లోనవెల్లి గ్రామం గుండా సిర్పూర్(టి)కి వచ్చారు. ఒక రోజు చిన్న పిల్లలు బాబా దగ్గరికి వచ్చి తమకు ఆకలి వేస్తోందని చెప్పగా ఆయన తన జోలె(సంచి)లో నుంచి వేడివేడి అన్నం పెడుతూ కనిపించారు. అలా బాబా మహిమలు చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించాయి. మహారాష్ట్రలో యుద్ధం చేసి ఓడిపోయిన ఓ రాజు తప్పించుకుని రాగా ఈబాబా ఆశ్రయం ఇచ్చారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. మొత్తం మీద బాబా అనంతరం ఇక్కడ దర్గా నిర్మాణం జరిగింది. నాటి నుంచి దర్గా మత సామరస్యానికి ప్రతీకలా నిలుస్తోంది. ప్రతి గురు, శుక్రవారాల్లో ముస్లింలు, హిందువులు కలిసి దర్గాలో దీపారాధన చేస్తారు. ఏటా మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడి బాబా ఆశీస్సులు పొందితే కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. అందువల్ల సిర్పూర్(టి) మండలంలోని అన్నిగ్రామాలతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, దహెగాం, బెజ్జూరు, మహారాష్ట్రలోని రాజురా, పోడ్సా తదితర గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వస్తుంటారు. మొదటిరోజు ప్రత్యేకంగా గుర్రం సవారీతో బాబాకు ప్రత్యేకంగా చాదర్ ఏర్పాటు ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహిస్తారు. కులమతాలకు అతీతంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొంటారు.

మెజార్టీ దక్కేదెవరికో?

- సర్వే చేయిస్తున్న ప్రధాన పార్టీలు
- ఎవరి ధీమా వారిదే



కాగజ్‌నగర్, మే 15: పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయాపార్టీల నాయకులు మెజార్టీపై దృష్టిసారించి అంతర్గతంగా సర్వేలు చేయిస్తున్నారు. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏయేపార్టీలకు ఎంత మెజార్టీ వస్తుందన్న టెన్షన్ అందరిలో నెలకొంది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల కోసం జిల్లాలో మెజార్టీ కోసం అగ్రనాయకత్వం బహిరంగ సభలు పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఓటింగ్ సరళి, మెజార్టీ అంశాలు ఎటు మొగ్గుచూపుతాయోనన్న టెన్షన్ పెరిగి పోతోంది. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలోనే అనూహ్యరీతిలో పడిపోయింది. ఎంపీ ఎన్నికల్లో పార్టీ క్యాడర్‌ను కాపాడుకొని కనీస మెజార్టీ తెచ్చుకునేందుకు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లాలో కృషిచేశారు. ఓటింగ్ జరిగినతర్వాత మెజార్టీవచ్చే ప్రాంతాలపై తమకున్న ద్వితీయశ్రేణి నాయకత్వంతో వాకబు చేయిస్తున్నారు. మాజీసీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు పార్టీకి ఓట్లుపడే అవకాశాలు ఎక్కువగా ఉండటం ఈసారి ప్లస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆపార్టీ నాయకులుబాహాటంగా చెబుతున్నారు. ఇదే పార్టీలో ఉన్న మాజీఎమ్మెల్యే కోనప్ప బీఆర్‌ఎస్ పార్టీని వీడటం మైనస్‌గా మారింది. ఈ లోటును పూడ్చేందుకు ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి విశ్వప్రయత్నాలు చేశారు. ఓటర్లు బీఆర్‌ఎస్‌పార్టీని ఆదరిస్తారా..? లేదా..? అనే టెన్షన్ బీఆర్‌ఎస్‌లో నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం, ఎంపీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఎంత మేర ఫలితాస్తాయోనన్నది ఆ పార్టీలోని నాయకులు లెక్కలు బేరీజు వేస్తున్నారు. జిల్లాలో మాజీఎమ్మెల్యే కోనప్ప తనక్యాడర్‌తో పార్టీలో చేరటం కాంగ్రెస్ పార్టీకి బలం పెరిగినట్లయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎంతమేర మెజార్టీ వస్తుందన్నది అంతా వేచి చూస్తున్నారు. ప్రధానంగా ఆరు గ్యారంటీలతో తమపార్టీకే అధికంగా ఓట్లువేసే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక బీజేపీలో కూడా పార్లమెంటు స్థానం కోసం ఏకంగా కేంద్రమంత్రి అమిత్ షాతో బహిరంగ సభ సక్సెస్ కావటం మెజార్టీ తమకే వస్తుందన్న ధీమాలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూరు అసెంబ్లీ స్థానం బీజేపీ కైవసం చేసుకోవటం కూడా బీజేపీకి మెజార్టీ కలిసి వస్తుందన్న లెక్కలు వేసుకుంటున్నారు. ఆయాపార్టీల నాయకులు ఎవరికి తెలిసిన వారితో వారు వివరాలు సేకరిస్తున్నారు. మెజార్టీ అంశం అన్ని పార్టీల్లో ఇప్పుడు గుబులు పుట్టిస్తోంది. ఈ జిల్లా ఓటింగ్ ఫలితాలు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబుకు అగ్నిపరీక్షల మారాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రం పీపీసీ ఇన్‌చార్జి తొలగింపు

దహెగాం, మే 15: మండలంలోని ఒడ్డుగూడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం డీసీఏవో ఎండీ రబ్బానీ విచారణ చేపట్టారు. మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తూకంలో మోసానికి పాల్పడుతున్నారని రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. రైతు సత్తయ్యకు చెందిన 109బస్తాలు, తుమ్మిడే నాగేష్‌కు చెందిన 48బస్తాలు, సామెర గౌరయ్యకు చెందిన 66బస్తాలు, దందెర అంజన్నకు చెందిన 80బస్తాలు, ఎల్కరి సంతోష్, దందెర భారతికి చెందిన 109బస్తాల ధాన్యాన్ని రెండు రోజుల క్రితం లారీలో రైస్ మిల్లుకు తరలించారు. ఈ విషయాన్ని రైతులతో సీడీఏవో మాట్లాడి తూకంలో అదనంగా వెళ్లిన ఒక కిలో ధాన్యాన్ని తిరిగి చెల్లిస్తామని తెలిపారు. అదే విధంగా నిర్లక్ష్యం వహించిన పీపీసీ ఇన్‌చార్జి తుమ్మిడి నారాయణను విధుల నుంచి తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. వరిధాన్యం కొనుగోలు బాధ్యతలను పీఏసీఎస్ సీఈవో బక్కయ్యకు అప్పగించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఆయనవెంట ఏఆర్ శామ్యూల్, రైతులు ఉన్నారు.

నాటుబాంబు పేలి ఎద్దుకు గాయాలు


తీవ్రంగా గాయపడిన ఎద్దు

కౌటాల, మే 15: మండలంలోని మొగడ్‌ధగడ్ గ్రామంలో అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబు పేలి ఎల్ములె జిత్రు అనే రైతుకు చెందిన ఎద్దు తీవ్రంగా గాయపడింది. రోజువారిలాగే బుధవారం ఉదయం జిత్రు తన ఎద్దును మేతకు వదిలిపెట్టాడు. అయితే గ్రామ శివారులో మేత మేస్తుండగా పందుల కోసం అమర్చిన నాటు బాంబు(గోలీలు) పేలి ఎద్దు మూతి, దవడ భాగం పూర్తిగా తెగిపోయింది. దీంతో ఎద్దు కనీసం నీళ్లు కూడా తాగలేని దుస్థితి నెలకొంది. మార్చిలో ముత్తంపేట గ్రామానికి చెందిన జాడి విలాస్ అనే రైతు ఎద్దు, మరో రైతుకు చెందిన ఎద్దుకు కూడా ఇదేలా జరిగింది. దీంతో ఆ రెండు ఎద్దులు కూడా కొన్ని రోజుల తరువాత మృతి చెందాయి. ఇలానాటుబాంబులు అమర్చినవారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- దాహార్తి కోసం పశువుల తండ్లాట


బెజ్జూరులో అడుగంటిన చెరువు అడుగంటిన చెరువులు, కుంటలు

బెజ్జూరు, మే 15: భానుడు రోజురోజుకు ఉగ్రరూపం దాలుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు అడగం టిపోతున్నాయి. గ్రామాల్లో ప్రజలకు మిషన్ భగీరథ, కులాయి ద్వారా నీరందుతోంది. కానీ చెరువులు కుంటలపైనే ఆధారపడే మూగజీవాలు నీటికి అల్లాడు తున్నాయి. పశువులు దాహార్తి కోసం తండ్లా డుతున్నాయి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో పశుపోషకులు పశువులను మేతకు విడిచిపెడుతున్నారు. ఇలా బయట సంచరించే పశువులకు తాగునీరు లేక విలవిలలాడు తున్నాయి. ఎక్కువగా పశువులు మేత మేసే సమ యంలో సమీపంలోని వాగులు, చెరువుల్లో దాహార్తి తీర్చుకుంటాయి. కానీ ఎండల కారణంగా చుక్కనీరు లేక వాటి దాహార్తి తీరడం లేదు.

అలంకారప్రాయంగా నీటి తొట్టెలు..

పశువుల దాహార్తి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నీటి తొట్టిలను నిర్మించడమే తప్ప వాటిని నీటితో నింపడం లేదు. గ్రామాల్లో గతంలో నిర్మించిన నీటితొట్టెలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి.

బొగ్గు గనులకు పొంచి ఉన్న ప్రమాదం



మాట్లాడుతున్న టి శ్రీనివాస్

మందమర్రిటౌన్, మే 15: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బొగ్గు గనులకు ప్రమాదం పొంచి ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమలపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు కుట్రలు చేస్తోందని, సింగరేణిలో ఇప్పటికే పలు గనులకు వేలం పాటలు వేసిందని, దీనికి వ్యతిరేకంగా తమ యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలు చేస్తున్నా అణిచివేస్తున్నారన్నారు. సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గిపోతూ వస్తుందని, నూతన గనుల ఏర్పాటుతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయన్నారు. గెలిచిన గుర్తింపు సంఘం సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేసి అమలయ్యేలా చూడాలన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతుగా ప్రచారం చేశామన్నారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా నూతనగనులు ఏర్పాటు చేయాలనేది తమ డిమాండ్ అన్నారు. నాయకులు జాఫర్, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా ధాన్యం కొనుగోళ్లు

- 75వేల మెట్రిక్ టన్నులు సేకరణ
- ఈ నెల 25 వరకు పూర్తి చేసేలా కార్యాచరణ
- రైతులకు రూ. 70 కోట్ల చెల్లింపులు పూర్తి



మంచిర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల లక్ష్యానికి చేరువలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఉంది. గత ఏడాదితో పోలితే ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. డీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాలను తొలగించి మహిళా సంఘాలు నిర్వహించే ఐకేపీ సెంటర్లకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. దీంతో కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. తూకంలో అవినీతి ఆరోపణల కారణంగా డీసీఎంస్, పీఏసీఎస్ కేంద్రాలను తొలగించిన అధికారులు, ఈ ఏడాది జిల్లాలో ఐకేపీ సెంటర్లకు పెద్దపీట వేశారు.

మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి ముందుగా ఆయా సెంటర్లను మూకుమ్మడిగా తొలగించిన అధికారులు పూర్తిగా ఐకేపీ మహిళలకే వరి దాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. దీంతో నియోజకవర్గంలో 80 శాతం మేర లక్ష్యం చేరుకున్నారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల్లో అక్కడక్కడ ఐకేపీ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాని కారణంగా తప్పని పరిస్థితుల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాలను కొనసాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆలస్యంగా నాట్లు వేయడం, కేంద్రాల ఏర్పాటులో జాప్యం కారణంగా కొంతమేర కొనుగోళ్లు మందగిం చినట్లు తెలుస్తోంది.

286 కేంద్రాల ద్వారా..

యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన వరి దాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 286 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనివార్య కారణాల వల్ల 32 కేంద్రాలను మూసివేయగా, ప్రస్తుతం 254 సెంటర్ల ద్వారా సీజన్‌లో మొత్తం 1,76 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నారు. అకాల వర్షాల కారణంగా దాన్యం తడిసిపోయే అవకాశం ఉండడంతో ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని సెంటర్ల నుంచి ఇప్పటి వరకు 10,998 మంది రైతులకు చెందిన 75,437 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అలాగే కొనుగోలు చేసి న దాన్యానికి సంబంధించి బుధవారం నాటికి రూ. 70.3 కోట్ల చెల్లింపులు జరుగగా, నగదు రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేశారు.

మరో పది రోజుల్లో..

జిల్లాలో సాగైన వరి ధాన్యాన్ని ఈ నెల 25వ తేదీ లోపు పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలనే లక్ష్యంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల పరిధిలో దాదాపు 80 శాతం మేర కొనుగోలు చేయాల్సి ఉంది. మంచిర్యాల నియోజకవర్గంలో 20 శాతం మిగిలి ఉంది.

జిల్లా వ్యాప్తంగా కల్లాల్లో మిగిలిపోయిన సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పూర్తిగా నిర్ణీత గడువులోగా కొనుగోలు చేసేం దుకు సమాయత్తం అవుతుండగా, నగదు కూడా త్వరిత గతిన బ్యాంకుల్లో జమ చేసేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి..: అదనపు కలెక్టర్ మోతీలాల్

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు పంపేలా నిర్వాహకులు అవసరమైన చర్యలు చేపట్టాలి. తద్వారా రైతులకు ధాన్యం నష్టం జరుగకుండా చూడాలి. రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యతతో తూకానికి వేయాలి. తప్ప, తాలు లేకుండా ధాన్యం తీసుకొస్తే కొనుగోళ్లు త్వరితగతిన పూర్తవుతాయి. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు. తడిసిన ధాన్యం పూర్తిగా ఆరబెట్టాకే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఏసీసీ, మే 15: ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు ఆర్డీవో పోలీసులతో ఉపాధ్యాయులపై బలప్రయోగం చేయించారని తెలిపారరు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకరకమైన రెమ్యూనరేషన్ పీవో, ఏపీవోలకు రోజుకు రూ. 600, ఓపీవోలకు రూ. 400 చెల్లించాలని జీవో నంబర్ 61ని ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవోలకు, ఏపీవోలకు రూ. 3,150 చెల్లించగా నారాయణఖేడ్‌లో రూ. 2,400 చెల్లించారని తెలిపారు. రెమ్యూనరేషన్‌లో తేడా ఎందుకుని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాలతో పోలీసులు లాఠీచార్జి చేసి గాయపర్చడం సరైంది కాదని, చర్యలు తీసుకోకుంటే ఉద్యమిస్తామని తెలిపారు.

ఘనంగా టీపీఏ ఆవిర్భావ దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: జిల్లా కేంద్రంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు కేక్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకియాట్రిస్టు సునీల్ మాట్లాడుతూ మానసిక సమస్యల పరిష్కారం కోసం టెలిమనాస్ కాల్ సెంటర్ 14416కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గుండేటి యోగేశ్వర్, పురుషోత్తం, శశికిరణ్, సుమనచైతన్య, సుమన్, దేవాన్షి, రజిత, అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

200 మంది కూలీలు హాజరయ్యేలా చూడాలి

తాండూర్, మే 15: ప్రతి గ్రామంలో 200 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కూలీకి రూ. 300 కూలీ వచ్చేలా పనులను చేయించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని, రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ లేకుండా చూడాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, ప్రతి రోజు గ్రామంలో తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. నీటి సమస్య ఉంటే పరిష్కరించాలని తెలిపారు. ఉపాధికూలీలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ దత్తరావు, ఎంపీవో సత్యానారాయణ, ఏపీవో నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

- కౌంటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్ బదావత్ సంతోష్

హాజీపూర్, మే 15: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి. ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గల స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లు, కంట్రోల్ రూంలను నోడల్ అధికారి గంగారం, హాజీపూర్ తహసీల్దార్ సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి, భద్రత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న కౌం టింగ్ ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని తెలిపారు. కౌటింగ్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మోడల్ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, మే 15: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కాలేజీలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అండె నాగమల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశంపొందే విద్యార్థులు ఈ నెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, ఒకేషనల్ విద్య, బాలి కలకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల మండిపాటు

జైపూర్, మే 15: మండల సర్వ సభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోదారి రమాదేవి అధ్యక్ష తన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడానికి జిల్లా స్థాయికి నివేదికలు పంపిస్తున్నట్లు ఎంపీడీవో సత్యానారాయణ అన్నారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు హామీ ఇచ్చి రైతు రుణమాఫీ అమలు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖ అధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నం దున అమలు కాలేదని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత పరీక్షలు నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీహబ్‌లో 21 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిచంద్రరెడ్డికి రెడ్‌క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, రక్తనిధి కేంద్రం సూపర్ వైజర్ మాధవి పాల్గొన్నారు.

కూలీలకు అంబలి పంపిణీ

కాసిపేట, మే 15: మండలంలోని మద్దిమాడ గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. నెల రోజులుగా ట్రస్టు ఆధ్వర్యంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ గేటు ముందు ఉచిత అంబలి పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి అంబలి పంపిణీ చేశారు.

ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: మంచిర్యాల జిల్లా కేంద్రంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ల ఆధ్వర్యంలో జిల్లాలోని ఐఎంఏ, థానా, డిస్ట్రిక్ యాంటీ క్వాకరీ సహకారంతో ఐదు బృందాలుగా ఏర్పడి ఆస్పత్రులను, ఆర్‌ఎంపీల క్లినిక్‌లను బుధవారం తనిఖీలు చేశారు. జిల్లా కేంద్రంలోనిమూడు ఆసుపత్రులు, మందమర్రి, నస్పూర్‌లో 11 మంది నకిలీ వైద్యులను గుర్తించి వారిపై కేసులు వేయనున్నట్లు టీఎస్‌ఎంసీ ఎథికల్ కమిటీ చైర్మన్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎటువంటి విద్యార్హత లేకుండా యాంటీబయోటిక్, స్టెరియిడ్‌లు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. గర్భవిచ్ఛిత్తి టాబ్లెట్‌లు , ఇతర వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందుకే తనిఖీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, నరేష్‌కుమార్, ప్రణీత్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలో బుధవారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో టీఎస్‌ఎంసీ ఎథికల్ కమిటీ చైర్మన్ కిరణ్‌కుమార్, పబ్లిక్‌రిలేషన్ చైర్మన్ నరేష్‌కుమార్, రవికుమార్, ప్రణీత్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మందులను తనిఖీ చేస్తున్న కౌన్సిల్ సభ్యులు

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రత్యేక అధికారుల పాలనలో పట్టింపు కరువు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

జైపూర్, మే 15: చెత్తతో సంపద సృష్టిపై పట్టింపు కరువైంది. గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రత్యేక పాలనలో ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీలో ఉపాధిహామీ నిధులు రూ. 1.20 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథకాలలో భాగంగా చాలా చోట్ల వీటిని ఉపయోగించి సంపదను సృష్టించారు. కానీ ప్రత్యేక అధికారుల పాలనలో గాలికి వదిలేశారు.

● తడిపొడి చెత్తతో..

గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన కోసం ప్రతి రోజు తడి, పొడి చె త్తను సేకరించి వాటిని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు సంపద సృష్టించే విధంగా ప్రణాళికలు రూపొం దించారు. కానీ సర్పంచుల కాలం పూర్తి కావ డం, ప్రత్యేకాధికారుల పాలనలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. ప్రస్తుతం ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుల్లో లేదా రోడ్ల పక్కన పడేస్తున్నారు.

● ఎరువుల తయారీ ఇలా..

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేస్తారు. తడి చెత్తను డీ కంపోస్టు చేయడంతో రెండు రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతుంది. దీనిని సెగ్రిగేషన్ షెడ్డులో ఉన్న బెడ్‌పై వేయడంతో అప్పటికే బెడ్‌లో ఉన్న వాన పాములు చెత్తను సేంద్రీయ ఎరువులుగా మారుస్తాయి. సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగపడే వాన పాములకు పోషకాలను కూడా అందిస్తారు. వానపాములు తడి చెత్తను పూర్తిగా సేంద్రీయ ఎరువుగా మారుస్తాయి. ఇలా వారంలో దాదాపు ఒకటి నుంచి 2 క్వింటాళ్ల సేంద్రీయ ఎరువు తయారువుతుంది. తయారు చేసిన సేంద్రీయ ఎరువులను 20, 50 కిలోల బస్తాల్లో విక్రయిస్తారు. కానీ సెగ్రిగేషన్ షెడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరు పయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ముదిగుంటలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: డెంగ్యూ నివారణకు తీసుకోవల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16న అన్ని ప్రాథమిక కేంద్రాలు, ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. డెంగ్యూ నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. డెంగ్యూ నివారణలో భాగంగా గ్రామాల్లో, మున్సిపాలిటీలో పంచా యతీ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది సహకారంతో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆశ్రమ హాస్టల్లలో దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరిం టెండెంట్ హరిచంద్రారెడ్డి, అధికారులు ఇస్మాయిల్, విశ్వేశ్వర్‌రెడ్డి, నాందేవ్, సంతోష్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: జిల్లాలో బుధవారం 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాసిపేటలో 41.1, జన్నారంలో 41.0, మంచిర్యాలలో 40.9, జన్నారంలో 40.7, దండేపల్లిలో40.6, బెల్లంపల్లి, భీమారంలో 40.2, తాండూర్, హాజీపూర్, మందమర్రిలో 40.0, చెన్నూరు, జైపూర్, కోటపల్లిలో 39.9, నస్పూర్‌లో 39.7, నెన్నెల, భీమినిలో 39.6 ,కన్నెపల్లిలో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: టీఎస్‌పీఎస్సీ, గ్రూపు 1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అర్హత గల అభ్యర్థులకు నమూనా పరీక్షలను నిర్వహించను న్నా మని తెలిపారు. వివరాల కోసం 08732-221280లో సంప్రదించవచ్చని తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి



ఆస్నాదలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరికృష్ణ

చెన్నూరు, మే 15: రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిం చాలని జిల్లా సివిల్ సప్లై అధికారి హరికృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని ఆస్నాద, కాంబోజిపేట, లింగంపల్లి, కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, బస్తా బరువు 41కిలోలు మాత్రమే కాంటా చేయాలని చెప్పారు. ఎక్కువ కంటా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొన్న తర్వాత రైతులకు కొనుగోలు పత్రాలను అందించాలన్నారు. ఓపీఎంఎస్ టాబ్‌లో రైతుల నమోదు వెంటనే చేయాలని, రైతులకు 48 గంటల్లో నగదును ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎం గోపాల్,డీటీ మధుసూదన్, సీఈవో లక్ష్మణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సదానందం కుటుంబాన్ని ఆదుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 15: ఎన్నికల విధుల్లో అస్వస్తతకు గురైమరణించిన రామకృష్ణపూర్ జడ్పీహెచ్‌ఎస్ పీడీ సదానందం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విదుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 15 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, బారిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత

తాండూర్, మే 15: మండలంలోని కొత్తగుడిసెల ప్రాంతంలోని పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షులు ఎలకరాంచందర్ రూ. 51,116, ఇడిదినేని లక్ష్మణ్ రూ. 37,500 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ శిధిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునర్నిర్మాణం చేయడానికి సంకల్పించామన్నారు. పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మద్దిబోయిన గోపాల్, పురంశెట్టి శంకర్, రమేశ్, శ్రీనివాస్, హరీష్, శ్రీకాంత్, వంశీ, సాయిశంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.